ఆమెపై అనుచిత చూపు

◆ ట్రిపుల్ఐటీ హైదరాబాద్ పరిశోధకుల అధ్యయనం

యువతులు.. మహిళలు నిండుగా దుస్తులు ధరించినా యువకులు... పురుషులు చాలా సందర్భాల్లో వారిని అనుచితంగా చూస్తున్నారని ట్రిపుల్ఐటీ హైదరాబాద్ కాగ్నిటివ్ సైన్స్ల్యాబ్‌కు చెందిన పరిశోధకులు తెలిపారు. నెదర్ల్యాండ్స్‌లోని రోటాడామ్ నగరంలో గతనెల జరిగిన అంతర్జాతీయ సదస్సులో తమ పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ప్రొఫెసర్ కవితా వేమూరి, పరిశోధక విద్యార్థులు ఆయుషి అగర్వాల్, శ్రీజా భూపతిరాజులు భారత్‌లోని వివిధ రాష్ట్రాల్లోని డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు, మెట్రోనగరాల్లోని ఐటీ సంస్థలను సందర్శించి యువకులు, ఐటీ ఉద్యోగులకు యువతులు, మహిళల చిత్రాలను ఇచ్చి 'ఐ ట్రాకింగ్ టెక్నాలజీ' సాయంతో వారి దృశ్య దృష్టిని పరిశీలించారు. వారి మనోభావాలను సేకరించి పరిశోధనపత్రాన్ని సమర్పించారు. అనంతరం బహిరంగ ప్రదేశాలు, ప్రజారవాణా సాధనాలు, పెళ్లిళ్లు, వేడుకలకు వెళ్లి యువకులు, పురుషుల దృష్టిని పరిశీలించగా... యువతులు, మహిళలను చాలామంది అనుచితంగా చూస్తున్నారని గుర్తించారు.

యువతులు, మహిళలపై పెరుగుతున్న లైంగిక వేధింపుల వెనుక మత్తు, సామాజిక మాధ్యమాల్లో అశ్లీలం, సినిమాల్లో ఐటంసాంగ్‌లు ప్రధాన కారణాలని ప్రొఫెసర్ కవిత తెలిపారు. తమ నివేదిక వివరాలను ఆమె విడుదల చేశారు.

మత్తు.. అశ్లీలం.. ఐటం సాంగ్‌లు

మద్యం తాగుతున్న యువకులు, మాదకద్రవ్యాలను వినియోగిస్తున్నవారు యువతులు, మహిళలను లైంగిక కోర్కెలు తీర్చేవారిగా భావిస్తున్నారని, పరిచితులు, అపరిచితులను కూడా వదలకుండా వేధిస్తున్నారని వివరించారు.

మనదేశంలో భిన్నమైన సంస్కృతులు, ఆచారాలు, అలవాట్ల కారణంగా యువతులు, మహిళల వస్త్రధారణ ఇలాగే ఉండాలన్న అభిప్రాయాలు బలంగా ఉన్నాయి. ఎందుకంటే... కురచదుస్తులు ధరించిన యువతిపై లైంగిక దాడి జరిగితే మన సానుభూతి ఒకరకంగా ఉంటుంది... సల్వార్-కుర్తా ధరించిన యువతిపై లైంగికదాడి జరిగితే మరోరకంగా ఉంటుందని ఈ అధ్యనయంలో వివరించారు.

బొమ్మలతో ప్రయోగాలు..

ఎలాంటి ఆహార్యంతో ఉంటే యువతులు, మహిళలను అనుచితంగా చూస్తున్నారన్న అంశంపై ట్రిపుల్ఐటీ హైదరాబాద్ పరిశోధకులు బొమ్మలతో ప్రయోగాలు చేశారు. సల్వార్, కుర్తాలు, చీరలను ఉపయోగించి కొన్ని బొమ్మలు, జీన్స్‌ప్యాంట్ షర్టులతో మరికొన్ని బొమ్మలను వేలమందికి పంపిణీ చేశారు. వాటిని చూస్తున్నప్పుడు వారి ముఖ కవళికలను, బొమ్మల్లో వేటికి చూసేందుకు ప్రాధాన్యమిస్తున్నారని తెలుసుకునేందుకు 'హీట్ మ్యాప్' పరిజ్ఞానం వినియోగించారు. ఎక్కువమంది యువకులు ముఖంతో పాటు లైంగిక శరీరభాగాలను చూసేందుకు ప్రాధాన్యమిచ్చారని తెలుసుకున్నారు.

ఈనాడు, హైదరాబాద్

మూసీ మురిపెం.. మూన్నాళ్లకే మాయం

సాలార్‌జంగ్ మ్యూజియం ముందు మూసీలో గతంలో సుందరీకరణ పేరుతో రూ. కోట్లు ఖర్చుచేశారు. ప్రత్యేకంగా లైటింగ్ హంగులు, నడక దారి ఏర్పాటుచేశారు. తరువాత నిర్వహణ లేకపోవడంతో ప్రస్తుతం దారి కూడా కనిపించని రీతిలో పిచ్చిమొక్కలు మొలిచాయి.

ఆర్టీసీ బస్సులో రూ.1.5 కోట్ల హ్యాష్ ఆయిల్

ఈనాడు– హైదరాబాద్: ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలానికి చెందిన గమ్మెలి గోవిందరావు(36), కొర్ర రాంబాబు(30) ఇద్దరూ స్నేహితులు. వ్యవసాయ కూలీలైన వీరు డబ్బుకోసం గంజాయి స్మగ్లర్ల అవతారమెత్తారు. అధిక ఆర్జనకు హ్యాషిష్ ఆయిల్(ద్రవరూప గంజాయి) విక్రయిస్తున్నారు. భారీగా లాభాలు కళ్లచూసిన వారిద్దరూ ఏపీ సరిహద్దులు దాటి హైదరాబాద్‌లో దందా మొదలుపెట్టాలనే ప్రయత్నంలో భువనగిరి ఎస్‌వోటీ, చౌటుప్పల్ రూరల్ పోలీసులకు దొరికిపోయారు. ఏపీ నుంచి ఆర్టీసీ బస్సులో రూ.1.52కోట్ల విలువైన 10.2 లీటర్ల హ్యాషిష్ ఆయిల్‌ను తీసుకొస్తూ ఈ ఇద్దరు సోమవారం పట్టుబడ్డారు. ఈ మేరకు వివరాలను చౌటుప్పల్ రూరల్ ఇన్‌స్పెక్టర్ రాములు, భువనగిరి, మల్కాజ్‌గిరి ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, ప్రవీణ్, ఎస్‌వోటీ అదనపు డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, డీసీపీ రమణారెడ్డితో కలిసి రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు మంగళవారం నేరేడ్‌మెట్‌లో వెల్లడించారు.

స్వాధీనం చేసుకున్న సామగ్రి ఫొటోలు చూపిస్తున్న కమిషనర్ సుధీర్‌బాబు, డీసీపీలు రమణారెడ్డి, మురళీధర్

డా.చిన్నారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ప్రైవేటు ఉపాధ్యాయ సంఘం నేతలు

ప్రజావాణికి 587 అర్జీలు

సోమాజిగూడ, న్యూస్‌టుడే: ప్రజాభవన్‌లో మంగళవారం ప్రజావాణికి 587 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మైనార్టీ సంక్షేమం-118, రెవెన్యూ 94, పౌరసరఫరాలు 88, పంచాయతీరాజ్ 47, ఇతర శాఖలకు 192 వచ్చినట్లు వెల్లడించారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డి వినతులు స్వీకరించారు. ◆ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఉపాధ్యాయులకూ పురస్కారాలివ్వాలని తెలంగాణ ప్రైవేటుటీచర్స్ ఫోరం కోరింది. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ షబ్బీర్‌అలీ నేతృత్వంలో ప్రతినిధులు వినతిపత్రమిచ్చారు. ◆ గ్రామ సచివాలయంనుంచి రాష్ట్ర సచివాలయం వరకు తెలుగు భాషను రాష్ట్రంలో అమలుచేయాలని స్నేహ భారతి సంస్థ ప్రతినిధుల బృందం అధ్యక్షుడు టీఎన్ దాస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసింది.

నిధులు, విస్తరణ, మార్గదర్శనం అంకురాలకు కీలకం

స్టార్టప్ ఫెస్టివల్ లోగో ఆవిష్కరిస్తున్న శివ మహేష్ టంగుటూరు, అచ్యుత్, జేపీ చౌదరి, శేషాద్రి వంగల, ప్రియగజ్జార్, రాధికా అగర్వాల్, శివాని, సత్యేంద్ర, డా.రవింద్రనాథ్ చౌదరి, విక్రాంత్

రాయదుర్గం, న్యూస్‌టుడే: అంకురాలకు నిధులు, మార్కెట్ విస్తరణకు సహకారం, సరైన మార్గదర్శనం లభించని పక్షంలో వాటి ఆవిష్కరణలు నిరుపయోగమవుతాయని ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ ఛైర్మన్ జేపీ చౌదరి అన్నారు. అలాంటి అంకురాలకు దన్నుగా నిలవాలనే ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ ఏర్పాటుచేశామని తెలిపారు. సెప్టెంబరు 26-28 వరకు గచ్చిబౌలి ఇంజినీరింగ్ స్టాఫ్‌కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)లో ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్(ఐఎస్ఎఫ్)-2024 నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అక్టోబరులో గ్రామీణ అంకురాలను ప్రోత్సహించేందుకు ఏపీలో అంకుర యాత్ర చేపడుతామన్నారు. టీహబ్‌లో మంగళవారం వివరాలను మీడియాకు వెల్లడించారు. ఐఎఫ్ఎస్ గోడ పత్రిక ఆవిష్కరించారు. 50వేల మంది ఆవిష్కర్తల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. డెమో డేలో 100 అంకురాలు ఆవిష్కరణలు ప్రదర్శిస్తాయన్నారు. 20 ఉత్తమ అంకురాలను జ్యూరీ సభ్యులు, నిపుణులు విజేతలుగా ఎంపిక చేస్తారని చెప్పారు. ఐఎస్ఎఫ్, ఫిక్కీ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

దొంగాట..!

- ఉద్యానాలు, మైదానాలే.. మాయగాళ్ల అడ్డాలు
- పెరుగుతున్న సైబర్ ముఠాల ఆగడాలు

ఈనాడు, హైదరాబాద్ : సైబర్ మాయగాళ్లు చొక్కా నలగకుండా రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానానికి చిక్కకుండా పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ప్రతి నెల రూ.120 కోట్లకుపైగా కొట్టేస్తున్నారు. గుజరాత్ కేంద్రంగా వందల సంఖ్యలో సైబర్ ముఠాలు దేశవ్యాప్తంగా మోసాలకు తెగబడుతున్నట్లు నగర సైబర్‌క్రైమ్ పోలీసులు నిర్ధారించారు. ఏకకాలంలో ఏడు బృందాల్లోని 40 మంది పోలీసులు 10 రోజులపాటు అక్కడే పాగా వేసి 36 మందిని అరెస్టు చేశారు. వీరిలో కీలక సూత్రధారులు 15 మంది వరకు ఉన్నట్లు తేల్చారు.

గతంలో గుజరాత్ సైబర్ నేరస్థుల నుంచి స్వాధీనం చేసుకున్న సొమ్ముతో సీపీ శ్రీనివాసరెడ్డి, పోలీసులు

షేర్‌మార్కెట్‌పై పట్టు..

◆ గుజరాత్‌లోని అన్ని వర్గాల్లోని అధిక శాతం మందికి షేర్‌మార్కెట్‌పై అవగాహన ఉంటుంది. వయోభేదం లేకుండా రోజువారి ట్రేడింగ్ చేస్తుంటారు. కొందరు సైబర్ నేరాలను వృత్తిగా మలచుకున్నారు. ◆ హరియాణా, దిల్లీ, రాజస్థాన్, యూపీ, మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాల్లోని మాయగాళ్లు రూ. లక్షలపై గురి పెడితే.. గుజరాత్ కేటుగాళ్లు రూ.కోట్లు లక్ష్యంగా దందా సాగిస్తున్నారు. ◆ బ్యాంకు లావాదేవీలు, ఆదాయ పన్ను, కస్టమ్స్, జీఎస్టీ తదితర అంశాల్లో వీరికున్న పరిజ్ఞానంతో తేలికగా బురిడీ కొట్టిస్తున్నారు. నకిలీ వెబ్‌సైట్లు, యాప్‌లను రూపొందించి టెలిగ్రామ్ యాప్ వేదికగా ఇన్వెస్ట్‌మెంట్, ఫెడెక్స్‌పార్సిల్, షేర్ మార్కెట్‌లో లాభాల పేర్లతో నెలకు రూ.500 కోట్లు కొల్లగొడుతున్నట్లు అంచనా. ◆ పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు తమ నివాసాలకు దూరంగా ఉండే క్రీడామైదానాలు, పార్కులను వేదికగా మలచుకున్నాయి. ఒక్కొక్కరు రెండు ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లతో ఎంచుకున్న ప్రదేశానికి వెళ్తారు. ◆ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఫోన్లు, బ్యాంకు లావాదేవీలు పూర్తిచేస్తారు. అక్కడే ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఇంటికి చేరతారు. చిరునామా తెలియకుండా ఈ దొంగాట ఆడుతున్నట్లు ఓ పోలీసు అధికారి తెలిపారు.

నగదు విత్‌డ్రా.. క్రిప్టోగా మార్పు

● దేశ, విదేశాల్లోని ఏ మూలకైనా.. ఎన్ని కోట్ల రూపాయలనైనా చేర్చగల సత్తా ఇక్కడి హవాలా ముఠాల సొంతం. బాధితుల నుంచి సొమ్ము ఖాతాల్లో జమ కాగానే.. తమ వద్దనున్న డెబిట్‌కార్డు, చెక్కులతో బ్యాంకుల నుంచి నగదు విత్‌డ్రా చేస్తున్నారు. ఆ సొమ్మును హవాలా ముఠాలకు అందజేసి క్రిప్టోగా మార్పించి చైనా, దుబాయ్, సింగపూర్, థాయ్‌లాండ్ తదితర దేశాలకు చేరవేస్తున్నారు.

శ్రావణమాసం ప్రత్యేక బస్సులు

రోజూ సగటున రూ.2.75కోట్ల ఆదాయం

ఈనాడు, హైదరాబాద్: శ్రావణమాసం సందర్భంగా రోజూ 1461 బస్సులను 3.89 లక్షల కిలోమీటర్లు తిప్పడం ద్వారా ఆర్టీసీకి రోజూ రూ.2.75 కోట్ల ఆదాయం సమకూరుతోందని సికింద్రాబాద్ రీజియన్ అధికారులు పేర్కొన్నారు. సికింద్రాబాద్ ప్రాంతంలో 4.38లక్షల కిలోమీటర్లు బస్సులు నడపడంతో రూ.3.57కోట్ల ఆదాయం లభించిందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 3 వరకు వివాహాది శుభకార్యాలకు అద్దెబస్సు బుకింగ్‌లపై 10శాతం రాయితీ ఇస్తున్నామన్నారు.

చికెన్ ధరలు			
ఫారంరేటు	109–00	డ్రెస్డ్	190–00
రిటైల్	131–00	స్కిన్‌లెస్	216–00

ఎస్ఈలతో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ సమీక్ష

ఈనాడు, హైదరాబాద్: సిటీ పరిధిలోని విద్యుత్తు సర్కిళ్ల సూపరింటెండెంట్ ఇంజినీర్లతో దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ ఫరూఖీ కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. నగర పరిధిలో 10 సర్కిళ్లు ఉండగా.. గత వారం 9 మంది బదిలీ అయ్యారు. కొత్తగా ఆయా సర్కిళ్లలో బాధ్యతలు చేపట్టిన ఎస్ఈలకు, మూడు జోన్ల చీఫ్ ఇంజినీర్ల ఆధ్వర్యంలో సీఎండీ దిశా నిర్దేశం చేశారు. నెలాఖరు కావడంతో బిల్లుల వసూలు, రెవెన్యూ కలెక్షన్లపై దృష్టి పెట్టాలని చెప్పారు.

బీసీల డిమాండ్లపై అఖిలపక్ష సమావేశం రేపు

కాచిగూడ, న్యూస్‌టుడే: బీసీల డిమాండ్లపై అఖిలపక్ష సమావేశాన్ని ఈ నెల 29న నగరంలోని లడ్డీకాపూల్ సెంట్రల్ కోర్టు హోటల్‌లో నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. అన్ని రాజకీయ పార్టీల ముఖ్య నేతలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా బీసీ కుల, ఉద్యోగ, యువత, మహిళ, విద్యార్థి సంఘాల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. మంగళవారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ, రాష్ట్ర కన్వీనర్లు గుజ్జ కృష్ణ, లాల్‌కృష్ణ సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతే రాష్ట్రంలో పంచాయతీరాజ్ ఎన్నికలను నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. నేతలు వేముల రామకృష్ణ, నందగోపాల్, అంజి, ఉదయ్, నిఖిల్, జోషి రాఘవ పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, లాల్‌కృష్ణ, గుజ్జకృష్ణ, రామకృష్ణ తదితరులు

కళల ఇలాకా.. కళ తప్పి ఇలా!

సికింద్రాబాద్ సంగీత్ చౌరస్తాలో గతంలో ప్రధాన ఆకర్షణగా వాయిద్య పరికరాల ఆకృతులను ఏర్పాటుచేశారు. పరిసరాల నిర్వహణ లేక వదిలేయడంతో అధ్వానంగా మారి రాళ్లు తేలి ఉన్నాయి. వాయిద్యాల ఆకృతులు సైతం రంగు వెలసి కళా విహీనంగా మారాయి.

పుస్తకం ఆవిష్కరించిన మిక్కిలినేని శ్రీకాంత్, కాట్రగడ్డ ప్రసూన, శ్రీనివాస్, రామనాథ్ వెలమటి, భవానీప్రసాద్, షాజహాన్, షకీలారెడ్డి, శాఖమూరి శ్రీనివాస ప్రసాద్

ఆశయ సాధకుడు చంద్రబాబు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయ సాధకుడని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి.భవానీప్రసాద్ అన్నారు. తెలుగు నేల, తెలుగు ప్రజల అభ్యున్నతికి చంద్రబాబు మొదటి నుంచి తపనపడేవారన్నారు. శాఖమూరి శ్రీనివాస ప్రసాద్ రాసిన 'చంద్రబాబు ఎక్స్. ఓ' హిందీ పుస్తకావిష్కరణ మంగళవారం రాత్రి ఫిల్మ్‌నగర్‌లోని ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన భవానీ ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ పుస్తకం రాజకీయానికి, చంద్రబాబు వ్యక్తిగత జీవితానికి సంబంధించినది కాదని, ఆయన వైవిధ్యమైన ఆలోచనల సమాహారమన్నారు. పుస్తక రచయిత మాట్లాడుతూ.. చంద్రబాబుతో 40 ఏళ్ల సుదీర్ఘ అనుబంధం ఉన్న ఏపీ రెరా మాజీ ఛైర్మన్ డాక్టర్ రామనాథ్ వెలమటి ద్వారా పలు అంశాలను ఈ పుస్తకంలో కూర్చినట్లు వివరించారు. కార్యక్రమంలో మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా. ఆంధ్రసారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, పుస్తక పబ్లిషర్ మిక్కిలినేని శ్రీకాంత్, కాట్రగడ్డ ప్రసూన, భవనం షకీలా రెడ్డి పాల్గొన్నారు.

సనాతన ధర్మం, గోసంరక్షణకు కృషి

ఇండోరియాను సన్మానించిన లక్ష్మణ్‌రావు తదితరులు

గోల్నాక, న్యూస్‌టుడే: సనాతన హిందూ ధర్మం, గోసంరక్షణకు కృషి చేయాలని తెలంగాణ బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్ రావు అన్నారు. మంగళవారం కాచిగూడలో జాతీయ మానవ హక్కులు, మహిళా, శిశు అభివృద్ధి కమిషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నవరతన్ ఇండోరియాను భాజపా నేత గోవింద్ రాఠీతో కలిసి సన్మానించారు.

అనురాగ్ వర్సిటీ ముందు ఆందోళన

బైఠాయించిన ఏఐఎస్ఎఫ్ నేతలు

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సంబంధించిన విశ్వవిద్యాలయం, నీలిమ మెడికల్ కళాశాల భవనాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయానికి ర్యాలీగా వచ్చి గేటు ముందు బైఠాయించి నినాదాలు చేశారు.

విపణిలోకి టీవీఎస్ జూపిటర్ 110సీసీ

జూపిటర్ 110 సీసీతో వైభవ్ శేఖర్, విశాల్ విక్రమ్ సింగ్

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల విపణిలోకి టీవీఎస్ మోటార్ కంపెనీ కొత్త జూపిటర్ 110సీసీని మంగళవారం విడుదల చేసింది. ఐజీఓ అసిస్ట్ సాంకేతికత వల్ల అధిక మైలేజీ ఇస్తుందని మార్కెటింగ్ ఏజీఎం వైభవ్ శేఖర్ తెలిపారు. సీటు కింద రెండు హెల్మెట్లకు సరిపోయే స్థలం, బాడీ బ్యాలెన్స్ సాంకేతికత ఉన్నాయన్నారు.

రాజీ మార్గంలోనే సమస్య పరిష్కారం

ఈనాడు, హైదరాబాద్: సమస్య ఏదైనా రాజీమార్గంలోనే పరిష్కరించుకోవాలని 'అమిక మధ్యవర్తిత్వ కేంద్రం' నిర్వాహకురాలు జి.జ్యోతిరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తరతరాలుగా వచ్చిన ఆస్తి పంపకాలకు సంబంధించి అనేకమంది రక్తసంబంధాన్ని కాదని గొడవలు పడుతున్నారని తెలిపారు. ఇరువురూ కూర్చుని మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారమవుతాయని సూచించారు. ఇందుకోసం కోర్టు మెట్లు ఎక్కాల్సిన పనిలేదన్నారు. తల్లిదండ్రులు గద్దించారని, భర్త తాగి ఇబ్బందిపెట్టాడని, అత్తమామలు కట్నం కోసం హింసిస్తున్నారంటూ అనేక మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వారికోసమే అమిక మధ్యవర్తిత్వ కేంద్రం పనిచేస్తోందని తెలిపారు.

విదేశీ అమ్మాయిలు... నగ్న వీడియోలు

◆ పర్యాటక వీసాలతో నగరానికి అక్రమ రవాణా
◆ మర్దన కేంద్రాలు, నివాసాల మధ్య వ్యవహారం

అమ్మాయిలతో సరదాగా మాట్లాడతారా..! ఆమె నగ్నవీడియోలను ఆస్వాదించానుకుంటున్నారా..! మీరిద్దరూ ఏకాంతంగా గడపాలని ముచ్చటపడుతున్నారా..! ప్రతి దానికీ ఒక రేటు. కొందరు నిషేధిత వెబ్‌సైట్లు, యాప్‌లతో అందాలను ఎరవేసి అందినంత దండుకుంటున్నారు. నగరంలో హైటెక్ వ్యభిచార గుట్టును పోలీసులు బట్టబయలు చేశారు.

వీళ్లతోనే..: విదేశీ యువతులను రప్పించి చీకటి కార్యకలాపాలు సాగిస్తున్నట్టు నిర్ధారించారు. కెన్యా, టాంజానియా తదితర దేశాలకు చెందిన అమ్మాయిలను అక్రమంగా భారత్‌కు తరలిస్తున్న ముఠాలు కొత్త తరహా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. గచ్చిబౌలిలో పట్టుబడిన 17 మంది యువతుల్లో కొందరి పాస్‌పోర్టు గడువు ముగిసినట్టు పోలీసుల దర్యాప్తులో గుర్తించారు.

సభ్యత్వం తీసుకున్నాకే..: ఒంటరితనం నుంచి బయటపడేందుకు.. సరదాగా మాట్లాడేందుకు సరైన భాగస్వామిని ఎంపిక చేసుకోవచ్చంటూ అంతర్జాలంలో ప్రకటనలిస్తారు. ఆకర్షితులైన వారిని వెబ్‌సైట్లు, యాప్‌ల్లో సభ్యత్వం తీసుకోవాలని షరతు విధిస్తారు. రూ.5-10 వేల వరకు సభ్యత్వ రుసుం వసూలు చేస్తారు. బంగ్లాదేశ్, శ్రీలంక, థాయ్‌లాండ్, సింగపూర్, నైజీరియా దేశాల నుంచి యువతులను ఉద్యోగం, పర్యాటక వీసాలతో నగరానికి చేరవేస్తున్నారు. మర్దన కేంద్రాలు, హోటళ్లు, నివాస ప్రాంతాల్లో గదులు అద్దెకు తీసుకొని అక్కడ వీరితో కార్యకలాపాలు సాగిస్తున్నట్టు నగరానికి చెందిన పోలీసు అధికారి తెలిపారు. అమ్మాయిలు నగ్నంగా మారి వీడియోకాల్‌లో మాట్లేడేందుకు అవకాశం కల్పిస్తున్నారు. వారితో గడిపేందుకు ఆసక్తి చూపిన విటులకు ఆ ప్రాంతాల్లోని ఏజెంట్ల ఫోన్ నెంబర్లు ఇస్తున్నారు. ఒక్కో యువతికి రోజుకు రూ.500-1000లోపు కమీషన్ ఇస్తున్నట్టు సమాచారం.

పోలీసుల సహకారంపై ఆరా

సగరంలోని పలు స్పా సెంటర్లలో వ్యభిచార కార్యకలాపాలను పోలీసులు చూసీచూడనట్టు పదిలేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సికింద్రాబాద్, గచ్చిబౌలి, మాదాపూర్, మియాపూర్ ప్రాంతాల్లో వీధివీధినా మర్దన కేంద్రాలున్నాయి. నగరంలోని ఓ రాణా పరిధిలో స్పా ల నుంచి ప్రత్యేక విభాగానికి నెలకు రూ.5లక్షలు చేరతాయని తెలుస్తోంది. తాజాగా మధురానగర్ రాణాలోని నలుగురు పోలీసులకు వ్యభిచారం నిర్వహించే మర్దన కేంద్రంతో సంబంధాలున్నట్టు వెలుగు చూసింది.

ఈనాడు, హైదరాబాద్

గంజాయి మత్తులో వీరంగం.. వ్యక్తి దారుణ హత్య

ఏరుపుల ముఖేందర్

బాలానగర్, న్యూస్‌టుడే: ఆలయ నిర్వహణలో గొడవల నేపథ్యంలో పగతో గంజాయి మత్తులో వీరంగం చేసిన ఓ వ్యక్తి.. వరుసకు సోదరుడిని గొడ్డలితో నరికి చంపిన ఘటన బాలానగర్ రాణా పరిధిలో జరిగింది. సీఐ నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. దామోదర సంజీవయ్య కాలనీకి చెందిన అన్నదమ్ముల వరుస అయిన ఏరుపుల ముఖేందర్(42), ఏరుపుల మధు(40) పక్కపక్క ఇంట్లో ఉంటారు. బస్తీలోని పోచమ్మ గుడి నిర్వహణలో వీరి మధ్య విభేదాలున్నాయి. గంజాయికి బానిసగా మారిన మధు ఇంటి బయట కనిపించిన ముఖేందర్‌ను చూసి రెచ్చిపోయాడు. ఇంట్లో నుంచి గొడ్డలి, రాడ్డు తీసుకొచ్చి మధుపై విచక్షణారహితంగా దాడి చేశాడు. అడ్డొచ్చిన ముఖేందర్ తల్లి సావిత్రి(65) తలపై కూడా గొడ్డలితో నరికాడు. ఇద్దరూ కుప్పకూలిపోయినా ఆగని మధు కొద్దిదూరం వెళ్లి తిరిగొచ్చి ముఖేందర్ తలపై మరో రెండుసార్లు నరికాడు. సమీపంలో కారు అద్దాలను ధ్వంసం చేశాడు. ఆలయ నిర్వహణలో మరో భాగస్వామిగా ఉన్న బాలమణి ఇంటికి కూడా వెళ్లి తలుపులు కొట్టగా ఆమె ఇంట్లో లేకపోవడంతో వీరంగం చేశాడు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని గొడ్డలి, రాడ్డు స్వాధీనం చేసుకున్నారు. ముఖేందర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. సావిత్రి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతుంది. మృతుడికి భార్య, రెండున్నరేళ్లు, ఐదేళ్ల ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారి గంజాయి దందా

రాయిపోల్‌లో ఇద్దరి అరెస్టు.. సరకు స్వాధీనం

ఈనాడు, హైదరాబాద్: ట్రాన్స్‌పోర్టు వ్యాపారంలో నష్టాలు రావడంతో ఓ వ్యక్తి గంజాయి దందాలోకి అడుగుపెట్టాడు. ఏపీ నుంచి మహారాష్ట్రకు భారీగా గంజాయి తరలిస్తూ పోలీసులకు రాయిపోల్ గ్రామం దగ్గర దొరికిపోయారు. ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్, సత్యనారాయణ, డీసీపీ మురళీధర్‌తో కలిసి రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు మంగళవారం నేరేడ్‌మెట్‌లో కేసు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతానికి చెందిన వాల్మీక్ రూపా మెహితే ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం చేసేవాడు. డ్రైవింగ్‌లో సహాయకుడిగా ఉండేందుకు సమీప బంధువు, గంజాయికి బానిసైనా దేవ్‌రామ్ చవాన్‌ను మోహితే నియమించుకున్నాడు. మెహితే మహారాష్ట్ర నుంచి విశాఖలోని కూరగాయల మార్కెట్‌కు ఉల్లిపాయల లోడుతో వచ్చే సమయంలో దేవరామ్.. స్థానికుడైన తిరుపతి దగ్గర గంజాయి కొన్నాడు. కొద్దిరోజులకు ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారంలో నష్టాలు రావడంతో మెహితే తన వాహనాన్ని అమ్మేశాడు. కష్టాల్లో ఉన్న అతడు దేవరామ్ సూచనతో ఏపీ నుంచి మహారాష్ట్రకు గంజాయి తీసుకెళ్లే వ్యాపారం చేయాలనుకున్నాడు. ఈ నెల 25న విశాఖలోని పెందుర్తికి వెళ్లి రూ.35 లక్షల విలువైన 60 కిలోల గంజాయి కొన్నారు. సూర్యాపేట, చౌటుప్పల్, ఇబ్రహీంపట్నం మీదుగా వస్తున్నట్లు సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ బృందం నగర శివారు రాయికల్ దగ్గర నిందితులను అదుపులోకి తీసుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

**పృథ్వి అసెట్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ సెక్యూరిటైజేషన్ కంపెనీ లిమిటె